# శివయ్యగారు బతికే ఉన్నారు!



**ఆత్మహత్య !**

కూర్చున్నచోట కూర్చున్నట్లే ఆలోచించాడు. నిలబడినచోట నిలబడినట్లే ఆలోచించాడు. నడుస్తూ ఆలోచించాడు.

ఎన్ని విధాల ఆలోచించినా అదొక్కటే పరిష్కారమని తోచింది శివయ్యకు !

ఆ ఏకైక మార్గానికి మనం ఏరికోరి పెట్టుకున్న ముద్దుపేరు ఆత్మహత్య.

కండ్లు మూసుకుని కాసేపు ఆలోచించాడు. కన్నార్పకుండా చాలాసేపు ఆలోచించాడు. ఎన్నివిధాల ఆలోచించినా అదొక్కటే పరిష్కారమని తోస్తూఉంది. అయితే తనపరిస్థితికి ఈ ప్రయత్నానికి లంకెమాత్రం కుదరడం లేదు.

నిద్రలేస్తూనే గృహకల్లోలాలు లేకుండా ఉంటే ... రాత్రి అనుభవాలు అనుభవానికి వస్తే... గృహిణికి అయ్యో పాపం! అనితోస్తే గొంతులో అంత కాఫీ పడితే పడచ్చు. నిద్ర

లేస్తానే కాఫీ పడినా పడకున్నా చెవుల్లో మాత్రం పడతాయి చెప్పలేనన్ని వార్తలు... వాటిలో మానవతా విలువల్ని ప్రశ్నించేవి హత్యలు!... ఆత్మహత్యలు!...

కొన్ని కంటపడుతుంటాయి. మరికొన్ని చెవిని పడుతుంటాయి.

అయితే పట్టు కత్తరించినట్టు మట్టసంగా జీవితాన్ని నల్లేరుపై నడక చేసుకొన్న శివయ్యకు ఇలాంటి ఆలోచన కలగకూడదు. కానీ కలిగింది. అదే ఆశ్చర్యం!...

తల్లిదండ్రుల చేతికింద బిడ్డగా ఉన్నప్పుడు శివయ్యపేరు శివుడు. కాలేజీలో చదువుకొంటున్నప్పుడు శివకుమార్. ఉద్యోగిగా బాధ్యతలనడుమ శివయ్య!

తల్లిచేతిబిడ్డగా చూడచక్కనివాడు శివుడు. చెప్పినట్లు విన్నాడు. శ్రద్ధగా చదువుకొన్నాడు. ఇంట్లో ప్రతిమనిషికి కంటిపాప శివుడు. బడికి మెదడు శివుడు. ఊరికి తలలోనాలుక శివుడు.

శివుడి ప్రస్తావనవస్తే ఒకటిరెండు మాటల తరువాత తప్పనిసరిగా శివుడు మంచివాడు. శివుడు చాలా తెలివైనవాడు. అనే మాటలు వద్దన్నా చోటుచేసుకొంటాయి.

మంచికి మంచిజరగడం చెడుకు చెడుజరగడం–ఈ లోకంలో విడ్డూరం.

శివుడి విషయంలో ఈ విడ్డూరమే జరిగింది.

శివుడు కాలేజీలో చదువుకొంటున్న రోజుల్లో ఒకానొకరోజు అలవోకగా ఒక దినపత్రికను తిప్పుతూంటే ఒక ప్రకటన కంటపడింది. 'మూగవాడు అబ్బా! అన్న కాలానికి కదా?' అనుకొని అందరి లాగా తాను ఒక దరఖాస్తు పడేశాడు తపాలాపెట్టెలో!

శివుడు ఆఊళ్ళో ఎక్కడో ఒకవీధిలో ఒకగోడకు వేలాడుతూండిన తపాలాపెట్టెలో వేసిన దరఖాస్తు చేరవలసినచోటు చేరిందనడానికి నిదర్శనంగా నెలతిరక్కముందే శివుడికి తాఖీదు వచ్చింది– రాతపరీక్షకు రమ్మని. దానినిచూస్తూ ఎగిరిగంతేశాడు. ఆ ఊపులోనే మదరాసులో వాలాడు శివుడు.

ఎంతో సంతోషంతో వాలిన శివుడు రాత పరీక్షకు హాజరైన వేలాదిమందిని చూసి తూలి పడపోయి... ఎలాగో తమాయించుకొని నిలబడ్డాడు. వాళ్ళకు కావలసింది వందమంది. వచ్చింది వేల మంది. వాళ్ళందర్నీ చూస్తుంటే దేశంలో ఇంకా ఇంతమంది నిరుద్యోగు లున్నారా? అన్న సందేహం కలిగింది శివుడికి. ఆ సందేహంతోనే 'ఇది కాని పనిలే' అనుకొంటూనే రాత పరీక్షకు కలం చేతపట్టాడు.

పరీక్ష ముగిసింది. గంటల వ్యవధిలోనే పరీక్షాపత్రాలు సరిచూశారు. అప్పటికప్పుడే ఫలితాల్ని ప్రకటించారు. మళ్ళీ శివుడు తూలిపడబోయి ఎలాగో తట్టుకొని నిలబడ్డాడు. ఆశ్చర్యం!– రాత పరీక్షలో వేలాదిమందిని వందలకు కుదిస్తే ఆ వందలో తానూ ఒక్కడు!

తరువాత ఆ వందల మందిని ఒక్క వందకు తగ్గించడానికి యక్ష ప్రశ్నలు!

యక్ష ప్రశ్నలకు సలక్షణంగా బదులు చెప్పడంలో ధర్మరాజును మించిపోయాడు శివుడు. ఉద్యోగంలో చేరడానికి ఉత్తర్వుల్ని చేతికందుకొన్నాడు.

అందుకొన్నప్పుడు శివుడి ఆనందానికి మేర లేదు కానీ, ఆ కారణంతో కాలేజీ చదువుకు స్వస్తి చెప్పాల్సి వస్తుందనుకొనేసరికి ఏదోచేయరాని తప్పు చేస్తున్నవాడిలా తపన పడ్డాడు. తపన పడుతూనే ఉద్యోగంలో చేరడమా? లేదు- కాలేజీ చదువు కొనసాగించడమా? అన్న మీమాంసలో పడ్డాడు.

"ఒరే అబ్బోడా! బి.ఎ. సదివినోళ్ళు బీడీలకు లాట్రీకొడ్తా ఉండారు. ఎమ్.ఎ. సదివినోళ్ళు ఏం జెయ్యాలో తోచక వీదులు సర్వేజేస్తా ఉండారు. రొట్టిరిగి నేతిలోపడ్తే సూస్తా లొట్ట లేసేవోడు ఎర్రోడు. ఎందుకు ఎర్రాటలాడ్తావు? ఎనకాముందూ సూడకుండా పొయ్ ఉద్దోగంలో సేరిపో" అని అన్నారు ఒకతరం మారినవాళ్ళు.

తలనెరిసినవాళ్ళ మాటలు ఎంత ప్రయత్నించినా తలకెక్కలేదు.

"మిష్టర్ శివకుమార్! నిజంగా నువ్వు 'లక్కీఫెలోవి'. ఈ రోజుల్లో డబ్బుంటే కొండమీదికోతి దిగిరమ్మంటే వస్తుంది కానీ, 'జాబ్' మాత్రం రాదు. దీని 'ప్రాసెస్' ఉందే- 'మైగాడ్!' శత్రువులక్కూడా వద్దనుకో! ఎందరికి మొక్కాలి! మరెందరికి ముడుపులు చెల్లించాలి! ఎన్నెన్ని కోతలు కొయ్యాలి? ఎన్ని జతల చెప్పులు మార్చాలి? అట్లాంటిదేమీ లేకుండా కనీసం ఏడుకొండల వాడికి గుండు కొట్టిస్తానన్న మొక్కుకూడా లేకుండా 'ప్యూర్ మెరిట్'తో నువ్వు ఉద్యోగాన్ని సంపాదించావంటే చాలా చాలా అదృష్టవంతుడివోయ్!" అని ఉభయ భాషాప్రవీణులైన విద్యార్థులు కొందరు ఒక భుజం తట్టి, మరి కొందరు రెండు భుజాల్ని పట్టుకొని ఊపి ఇంక కొందరు అమాంతంగా కౌగలించుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

పదుగురాడుమాట పాటియై ధరచెల్లు! శివకుమార్ ఉద్యోగంలో చేరాడు.

ఆ ఉద్యోగం పేరు రైల్వేలో 'బుక్కింగ్ క్లార్క్!' అది ఒకవింత ప్రపంచంలా కనిపించింది శివకుమార్‌కి.

రైళ్ళు రావడం...ఉలిక్కి పడ్డట్టుగా ప్రయాణికుల అగడాలు...పెట్టెల్లో ఎక్కడానికి, దిగడానికి జగడాలు. అదొక జాతరలా ఉండేది. అందమైన అయిదు నిమిషాల జాతర జరిపి ఆ రైలు వెళ్ళిపోతే ఆ ప్లాట్‌ఫారం కోరికలుడిగిన మనసులా ఈసురోమనిపించేది.

ఎన్నెన్నో ఊళ్ళకు టిక్కెట్లు! ఆ టిక్కెట్లన్నీ అలమరలాంటి ఒక్కపెట్టెలోని సొరుగుల్లో పొందుపరిచిన తీరు...లాగుతూంటే ఒకదాని తరవాత మరొక్కటి వచ్చే తీరు- అతి చిత్రంగా తోచేవి శివుడికి.

'కట్టు కట్టు... కడ కట్టు కడ' అన్న శబ్దం ఒక యంత్రంలోనుండి నిరంతరం వినిపిస్తూ ఉంటుంది. ఆ శబ్దాన్నివింటూ ఒక వ్యక్తి ఆ శబ్దానికి అక్షర రూపాన్ని కల్పిస్తుంటాడు. అది చూస్తూ నోరు తెరుచుకొని నిలబడిపోయేవాడు శివుడు.

ఇక రైళ్ళు నడపడానికి పాటిస్తున్న పద్ధతులు ఇంద్రజాలంలా తోచేవి.

వయస్సు లేత. అనుభవం లేదు. అందుచేత ఒక కొత్తప్రపంచంలో మరీకొత్తగా కాలూనినట్లుండేది శివుడికి. అప్పుడప్పుడు ఆ రైళ్ళలో దర్జాగా మొదటి తరగతిలోనే కూర్చొని

అటూ ఇటూ ప్రయాణం చేయడం ఏదో రాచఠీవి అనుభవించినట్లు ఉండేది. ఇప్పుడతడు కాలేజీ చదువుల్ని గురించి కలలోకూడా తలవడం లేదు.

శివుడు చాలా మంచివాడు. చాలా తెలివైనవాడు. అని అనిపించుకొన్నాడు ఆ స్టేషనులో నెలలు తిరగకముందే!

ఇలానే చీకూ చింతా లేకుండా ఆనందంగా జరిగిపోవలసింది కాలం. కానీజరగలేదు. 'ఒరే, అబ్బోడా! ఇంక నీకిది తప్పదురా!' అన్నట్లుగా పట్టుబట్టి మెడలో ఒక గుదిబండను తగిలించారు తల్లిదండ్రులు. శివుడు నోరు కదపలేదు. మెదపలేదు. మంచివాడు కదా మరి? గుట్టుగా గుదిబండను మెడకు తగిలించుకొన్నాడు.

అదెలా జరిగిందయ్యా అంటే?

శివుడి మంచితనం ఆ రైల్వే స్టేషనుకే పరిమితం కాకుండా ఊరి మీదికి ప్రాకింది. దీంతో ఒకపెద్ద ఆఫీసరుగారు శివుని మంచితనంతో ముగ్ధుడై తెలివితేటలతో ప్రభావితుడై ఆ తెలివితేటల్ని తనముద్దులకూతురికి పంచి ఇవ్వాలని సంకల్పించాడు.

ఒక తెలుగు అబ్బాయి మరొక తెలుగు అమ్మాయికి తెలివితేటల్ని పంచి ఇవ్వడాన్ని తెలుగులో ఏమంటారు? అని అడిగితే మేధావులైనా నిలబడి ఆలోచించాల్సిందే కానీ, ఈ తెలుగుదేశంలో ఒక నిరక్షరాస్యుణ్ణి నిలబెట్టి అడిగితే తడుముకోకుండా 'ట్యూషన్' అని అంటాడు.

ఆ ఆఫీసర్ ముద్దుల కూతురి పేరు ముద్దులక్ష్మి!

మూగదానికి సుభాషిణి పేరన్నట్లు కాకుండా చాలా జాగ్రత్తగా ఆలోచించి ఆచితూచి పెట్టినపేరు.

ముద్దులక్ష్మి ముద్దుగా ఉంటుంది. బొద్దుగా ఉంటుంది. ఆమె తండ్రి చేయి చాపనవసరం లేకుండా చేతికి మించివచ్చే అనుకూలమైన ఉద్యోగం. కార్లకు...నౌకర్లకు...షికార్లకు...దర్జాలకు కొదవలేని జీవితం!

అలాంటి ముద్దు లక్ష్మి ఉన్నట్లుండి పడిపోయింది ప్రేమలో. శివుడి ప్రేమలో!

అప్పటికే ఆ అభిప్రాయంతో ఉన్న ఆమె తలిదండ్రులు నిస్సందేహంగా ఆ రైల్వే ఉద్యోగి చేతికి పచ్చజెండా ఇచ్చేశారు.

'పచ్చజండా! ఊపడమా? వద్దా? అన్న సందిగ్ధంలో పడ్డాడు శివుడు.

అందుకే 'ఆనోబోసో' మని బయలుదేరి రైల్లోనే చేయగలిగినంత దూరం ప్రయాణం చేసి అక్కడ దిగి ఒక బస్సెక్కి ఆ బస్సు దిగి మరో బస్సెక్కి దానినీ దిగి ఆపై నాలుగు మైళ్ళు కాలికి కాలు కొట్టుకొంటూ నడిచి ఊరు చేరుకొన్నాడు. మూడుదశాబ్దాల స్వాతంత్ర్యానంతరం ఈ పవిత్ర భారతదేశంలో 'ఇలాంటి ఒక పల్లె ఉందా?' అని ఆశ్చర్య పడకండి. అబ్బతోడు! ఎవడికో కోపంవచ్చి విసిరిపారేసినట్టుంది. ఆ పల్లెలో శివుడి అబ్బ ఎద్దులగొట్టి ముద్దలు తింటున్నాడు.

శివుడి తండ్రి కాసేపు దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు అభినయించాడు.

ఆ మీదట–

"అయితే వాళ్ళకు కార్లుండాయంటావు. మిద్దెలు మేడలుండా యంటావు. ముద్దులక్ష్మి ముద్దుగా ఉండాదంటావు. వాళ్ళింటినిండా డబ్బుండాదంటావు. ఆ అమ్మి ఒంటినిండా నగలేనంటావు. కావలిస్తే నిన్ను ఇల్లటానికి తీసుకుంటారంటావు".

తండ్రి తననుండి వినిన మాటల్నే మళ్ళీ వత్తివత్తి పలికితే అవునన్నట్లుగా తల ఆడించాడు శివుడు.

"ఒసేయ్ యాడసచ్చినావే!..." దాదాపు ఒక గావుకేక పెట్టాడు శివుడి తండ్రి.

ఏ పనిమీద ఉండిందో ఏమో పాపం! ఆ గావుకేక చెవిని పడేసరికి ఉన్నపళంగా వచ్చి ఎదట నిలబడింది.

"అయినా ఇంత అన్నాయంవా! అహం! నేను బతికుణ్ణంగానే ఇంతపనికి తెగిస్తావా? దీనికంటే నిద్రపొయ్యేటప్పుడు కసక్కమని గొంతటా కోసిపారెయ్యరాదా?"

ఆ ముగ్గురిమధ్య అర్థంకానిచూపులు ఒక త్రిభుజాకారాన్ని సృష్టిస్తున్నాయి.

"ఇంతకాలంగా ఈడు నాకే పుట్నాడనుకుంటా ఉంటిగదే!"

ఆ మాట నసాళానికెక్కింది ఆ ఉత్తమ ఇల్లాలికి.

"ఛీ ఛీ! ఏంపాడు మాట్లే అవ్వి? నీకేమన్నా బుద్ధుండాదా లేదా?"

"ఆ మాట నీ ముద్దుల కొడకునే అడుగు!"

అప్పటికీ ఆమాటలోని అంతరార్థం అంతుపట్టక ఆ ఇల్లాలు అయోమయంగా చూస్తూ ఉంది. తండ్రి ఎత్తిపొడుపు కత్తిలా సూటిగా గుండెల్లో దిగబడితే శివుడి కండ్లు నిండుకొన్నాయి.

"నాకు పుట్టుంటే వాడు నా మాదిరిగానే కులపుదాన్నే కోరుకునేవాడు. కన్నోడికి పుట్టిన నా కొడుక్కి కన్నబుద్ధులు రాకుండా ఉంటాయా?" దెప్పుతున్నాడు తండ్రి.

అమ్మకు, కొడుక్కు ఆమాటతో తలతిరిగింది. కొడుకు ఒక్కక్షణం అక్కడ నిలబడలేక పోయాడు. గిరక్కున వెనక్కు తిరిగాడు. ఆ ఊపులోనే నాలుగు మైళ్ళు నడిచాడు. రెండు బస్సులు ఎక్కి దిగి, కడపట రైలెక్కి, రైలు దిగుతూనే ఎర్రజండా ఊపేశాడు.

అయితే రైలు వెళ్ళిపోయింది.

ముద్దులక్ష్మి ట్యూషన్ ఆగిపోయింది.

శివుడి తండ్రి 'సెబాస్ కొడకా!' అంటూ మీసం మెలివేశాడు.

తత్ఫలితంగా శివుడు మీసకట్టు ఏర్పడకముందే ఒక ఇల్లాలికి మొగుడై కూర్చున్నాడు.

పెండ్లి చూపులు లేవు. ఆ అమ్మాయి ఎవరో తెలియదు. ఎవరో తెలియనప్పుడు అభిప్రాయాలు అభిరుచుల సంగతి ఆలోచించవలసిన అవసరమేలేదు. పెండ్లి పత్రిక చూసేవరకు పేరే తెలియదు. అలాంటి వ్యక్తితో కలిసి జీవించాలి. ఏదో వెలితిగా తోచింది శివుడికి.

అసలు శివుడికి వల్లమాలిన స్వాభిమానం. అడపా దడపా ఒకటీ అరా కథలు కూడా రాస్తున్నాడు. విరహ గీతికలు గిలుకుతున్నాడు. ఎన్నో తెలుగు కథల్ని శరత్ సాహిత్యాన్ని పట్టుబట్టి చదివాడు. అందుచేత అతనికి 'స్త్రీ' అంటే ఒక నిశ్చితమైన అభిప్రాయం ఏర్పడింది. తన జీవిత భాగస్వామిని శరత్ నాయకిరాల్లాగా ఉండాలని కలలు గనేవాడు. ఆ కలలకు ఫలితంగా ముక్కూమొగం ఎరగనివ్యక్తి జతచేరింది. కలలకు వాస్తవాలకు పొంతనాలు కుదరలేదు. కానీ ఎవరో కన్నబిడ్డకు తనకు పొంతన కుదిరింది. జీవితం అంటే అదేనేమో? తన భవితవ్యం ఎలా ఉంటుందోఅని కలవరపడ్డాడు శివుడు.

కానీ పొంగుతున్న వయసు. కంటెదుట సొగసు. వయస్సుకు సొగసుకు ఒద్దిక కుదరడానికి మధ్యవర్తిత్వం లేకపోయింది. అవి రెండూ కూడబలుక్కొన్నాయి.

రాత్రిళ్ళు ఎలా గడిచిపోయేవో తెలిసేదికాదు. అలిసి సొలిసిపోతే ఏ తెల్లవారుజాములోనో ఒళ్ళు తెలియని నిద్ర ముంచుకొచ్చేది. అస్తవ్యస్తంగా బట్టలు. ఒళ్ళు తెలియని నిద్ర. పడకమీద అలానేపడి ఉంటే ఆ అమ్మాయి ముందుగానే నిద్రలేచేది. తాను శుభ్రంగా స్నానం చేసి తనకు వేడినీళ్ళు పెట్టేది. స్నానం చేస్తూంటే ఎంతో ఆప్యాయంగా ఒళ్ళంతా సబ్బు నురగలు కట్టేలా రుద్దేది. బట్టలు తొడుక్కొనే సరికి రాత్రి అనుభవాల్ని రంగలించి కమ్మని కాఫీ అందించేది. రైల్వేస్టేషనుకు బయలుదేరుతూంటే- ముద్దుగా ముస్తాబై వాకిట్లో నిలబడి చూపు ఆనినంత దూరం చూస్తూ నిలబడేది.

సాగనంపడం వాకిట్లో నిలబడి ఎదురుచూడడం కూడా వాకిట్లో నిలబడే!

కంటపడ్డేచాలు, ఆ చూపుల్లో ఎంత తృప్తి తొణికిసలాడేదో?

ఆమె అందిస్తున్న అనుభవంలో ఎంత అనుభూతి! చేస్తున్న సేవల్లో ఆత్మీయత. చూస్తున్న చూపుల్లో అనురాగం. అగ్నిసాక్షి... పెద్దలచేతి అక్షింతలు... బాధ్యత విలువల్ని గుర్తుచేస్తున్నాయి. ఆమె ఆత్మీయతానురాగాలు బాధ్యతను ప్రేమగా మారుస్తున్నాయి.

అడిగేదానికి అత్తమామలు...తోడి తినడానికి తోడికోడళ్ళు...దండించేదానికి బావమరదళ్ళు లేని కారణంగా మా కాపురంలో అనురాగం అందాల గోపురాలు కట్టింది. ఆమె ఏటా బాలెంతరాలయింది.

శివుడు ఇప్పుడు ముగ్గురు బిడ్డల తండ్రి.

బుద్ధుడికి బోధివృక్షం అవసరమయింది జ్ఞానోదయం కలగడానికి. శివుడికి అలాంటి అవసరంకూడా లేకుండా పోయింది. ముగ్గురు బిడ్డల తండ్రి అయ్యేసరికి అతనిలోని కళాత్మక హృదయం మేలుకొనింది. మేలుకొని జీవిత గమ్యాన్ని గురించి ఆలోచించసాగింది.

పొట్టకూటికై పోరాటం! తన భార్యా ... తన పిల్లలు ... తన ఇల్లు ... తన వాకిలీ అన్న ఆరాటం. ఈ పోరాట ఆరాటాల మధ్య పొద్దుపుట్టి పొద్దుపోతూ ఉంది. ఇలా పోతూ పోతూ ఉంటే ఏనాటికో ఒకనాటికి బతుకే ముగిసిపోతుంది.

గానుగెద్దు జీవితాల గమ్యమంతా దాదాపు ఒకటిగానే ఉంటుంది.

అలా కాకూడదనే శివుడి తపన.

గూటానికి కట్టబడ్డగొడ్డు గూటంచూట్టూ తిరుగుతుంది. ఉద్యోగం చేసుకునేవాడు ఉద్యోగం చుట్టూ తిరగతాడు. అంతకుమించి తిరగడానికి ఆస్కారం లేదు. అవకాశం లేదు. జీవితంలో అవకాశాలు వెదుక్కొని రావు. వాటికోసం వెదకాలి. వెదకాలంటే తిరగాలి. తిరగాలంటే ఉద్యోగం గుదిబండ. అందుకే ఉన్నట్లుండి ఒక సుప్రభాతాన ఉద్యోగ జీవితానికి మంగళగీతం పాడేశాడు.

ముగ్గురు బిడ్డల తండ్రి శివుడు వీధిలో పడ్డాడు!

రైలు రోడ్డుమీద ప్రయాణం- ప్రశాంత సాగరాన నౌకాయానం. కుదుపులు గిదుపులు లేకుండా హాయిగా కొనసాగిపోతుండేది. రైలు రోడ్డుమీద నుండి పడింది మట్టిరోడ్డుమీద. ఇక్కడ ఎటు చూసినా మిట్టపల్లాలు. రాళ్ళు రప్పలు. గుంతలు. ఏమాత్రం అజాగ్రత్త పడినా దెబ్బలు తగలడమో, కాలూచేయి విరగడమో తప్పనిసరి!

'దిగితే తెలిసింది లోతు!' అన్నట్లుగా ఈ లోకంలో ఉద్యోగం లేని జీవితం ఎంత భయానకమో అర్థమవుతూ ఉంది శివుడికి.

ఎంతోఆప్యాయంగా పలకరిస్తున్నవాళ్ళే పలకడమే పాపమన్నట్లు తలవంచుకొంటున్నారు. కొందరు చూసీచూడనట్లు తప్పుకుపోతున్నారు. కొందరు ఎదుటపడి ఏదో చేయరాని తప్పు చేసినట్లు నిలదీసి అడుగుతున్నారు. కొందరు దొంగను చూసినట్లు చూసి చాటుమాటుగా దొరల్లాగా నవ్వుకొంటున్నారు.

ఎంత ఆలోచించినా వీళ్ల తత్త్వమేమిటో అర్థం కాలేదు శివుడికి.

పెట్టి పోషించమని అడగలేదు. 'దేహీ!' అని చేయి చాపి అర్థించలేదు. తన కష్ట సుఖాల్ని ఏకరవు పెట్టుకోలేదు. బతకడానికి ఏదో ఒక మార్గం చూపించమని ప్రాధేయపడలేదు. అయినా ఈలోకం తననైజగుణాన్ని మాత్రం మానలేదు.

అంటే- బతుకు చెడినవాడిని ఇలానే చూస్తుందేమో లోకం!

అయినా తన ధైర్యాన్ని వదలలేదు శివుడు. అలా అని మొండిగా ముందుకు దూకలేదు. నెమ్మదిగా నిలబడి కాస్త లోతుగా ఆలోచించాడు.

తన కాళ్ళమీద తాను నిలబడినప్పుడే ఈ లోకంలో కళాకారుడికి గౌరవం. నిలబడలేనప్పుడు లోకందృష్టిలో వాడొక పిచ్చివాడు. పిచ్చివాణ్ణి వాడిమానానవాణ్ణి వదిలిపెట్టదు లోకం. వాడిమీద అదొక హేలగా రాళ్ళు రప్పలు రువ్వి నానాహింసలు పెడుతుంది.

ఆ హింసల నుండి తప్పుకోవాలంటే తనకాళ్ళ మీద తాను నిలబడాలి.

అందుకే పువ్వులమ్మిన చోట కట్టెలమ్మడానికి పూనుకొన్నాడు శివుడు.

కట్టెలమ్మాడు. కాఫీపొడి అమ్మాడు. కడకొక ముద్రణాలయాన్ని నెలకొల్పి కార్మికుడయ్యాడు. కార్మికుడై నినాదాలు చేయలేదు. వివాదాలు సృష్టించలేదు. తన పని తాను చేసుకొన్నాడు. తన కాళ్ళ మీద తాను నిలబడ గలిగాడు.

"నువ్వు నిలబడ గలిగావు, బాగానే ఉంది. మమ్మల్ని చూడు. మాకాళ్ళ మీద మమ్మల్ని నిలబెట్టు!" అని అన్నారు చుట్టూ చేరి ఆరుమంది బిడ్డలు.

నా కాళ్ళ మీద నేను నిలబడడానికి చేస్తున్న ప్రయత్న కాలంలో ప్రయత్నించి అర్థాంగి అందచేసిన అదనపు బాధ్యత ఇది!

ఆ బాధ్యత ఒక వైపు .... కళాత్మక హృదయం మరొకవైపు.....సమ ఉజ్జీలుగా నిలబడి గుంజులాడు కొంటున్నాయి. బాధ్యతారహితుడికి ఈ లోకంలో మనిషిగా గుర్తింపులేదు. ఆ బాధ్యతా పరిష్కారానికి పథకాలు వేసుకొంటూ, ఆ పథకాలు ఫలించడానికి నిరంతరం శ్రమిస్తూ ఏనాటికో ఒక నాటికి ఎదురు చూసిన క్షణం ఎదురవుతుందని ఆశిస్తున్నాడు.

అయితే అనుకోని విధంగా ఎదురైన పరిస్థితి మరొకటి!

శివుడు ప్రేమలో పడ్డాడు!!

వయస్సుల్లో ఉన్నవాళ్ళు వలపు తలపుల్లో తలమునకలై 'ప్రేమ'లో పడడం సహజం. ఆర్థిక పుష్టి కలిగిన వాళ్ళు కామోద్రేకంతో కన్ను మిన్ను కానని స్థితిని 'ప్రేమ' గా భ్రమించడం కూడా కద్దు. ఇక కళాత్మక హృదయాన్ని కవ్వించి ప్రేమగా లాలించి లోబరుచుకొనే శక్తి ఒక్క సౌందర్యానికి మాత్రమే సాధ్యమేమో?

కానీ అప్పటికే ఆమె నలుగురి పిల్లల తల్లి. అకాలమరణానికి భర్త గురిఅయితే 'అదృష్ట విహీనం'గా లోకం దృష్టిలో లెక్కకెక్కింది. ఏదోవిధంగా ఈ జీవితంలో తానూ లెక్కకెక్కి బిడ్డల్ని గట్టెక్కించాలన్న ధ్యేయం ఆమెది.

ఆరుమంది బిడ్డల తండ్రి శివుడు నలుగురి బిడ్డలతల్లి ప్రేమలో పడ్డాడు.

లోకం పని కట్టుకొని నవ్వింది. అయితే శివుడికి చీమ కుట్టినట్లనిపించలేదు. కారణం‒ లోకం దృష్టిలో వాళ్ళ అన్యోన్యత 'ప్రేమ'గా మారుమోగినా, ఆనాటి ఆమె దయనీయమైన స్థితి ఒక కళాత్మక హృదయంలో సానుభూతిగా చోటుచేసుకొనింది. సానుభూతి సహాయానికి ప్రేరేపించింది. సహాయం ఇరుపక్షాల బాధ్యతను గుర్తుచేసింది. కాలగమనంలో అందమైన ఆ బంధానికి మరొక పేరు ప్రేమ.

ఆమెకు 'తనామన' ఎవ్వరూ లేరనడం తప్పు. ఆమెకు ఒక్క అన్న. ఒక్క అక్క. అన్నగారు ఆమె గతజీవిత ప్రవర్తనల్ని స్వయంకృతాపరాధాలకింద జమకట్టే, అక్క 'మగనాలు' గా నిరూపించుకొనింది.

అమాయకంగా కనిపించినా ఆమె చాలా చిత్రమైన మనిషి! మాటలు నేర్వనట్లే నేర్చి మాట్లాడుతుంది. 'ఏమి తెలియని వెర్రిబాగుల్ది' అని అనిపిస్తూనే ఆవులిస్తే పేగులు లెక్కపెడుతుంది. ఆధారంలేని బతుకు ఎన్ని తెలివితేటలున్నా, శక్తి యుక్తులున్నా, ఈ లోకంలో అందగించదని ఆమె గట్టిగానమ్మింది. ముఖ్యంగా ఎదుటిమనిషి మనస్సును పట్టుకోవడంలో ఆమెకు పట్టువిడుపులు బాగాతెలుసు!

ఆమె శివుడి మనస్సును ఆకట్టుకొనింది!

మనస్సు పట్టుబడేసరికి మనిషి కూడా పట్టుబడిపోయాడు. ఆమె చుట్టూ తానూ, తన చూట్టూ ఆమె తిరుగుచూ ఉంటే కాలంతిరిగిపోతూ ఉంది. కాలం తిరిగేకొద్దీ శివుడి బాధ్యతలు పెరిగిపోతున్నాయి.

ఒకచోట బాధ్యతలో నుండి ప్రేమ పుట్టింది. ఇంకొకచోట ప్రేమలోనుండి బాధ్యత పుట్టింది.

ఏది ఎలా జరిగినా మోయవలసిన బాధ్యత మాత్రం ఎక్కువయింది శివుడికే!

మనుషుల్లో రెండు రకాలున్నారు. శరీర కష్టం మీద బతికేది ఒక తెగ. అది శ్రామికవర్గం. కేవలం తెలివితేటల మీద బతికేది ఇంకొక తెగ. అది మేధావి వర్గం. సాధారణంగా ఈ రెండు వర్గాలకు పొత్తు కుదరడం దుర్లభం. కానీ ఈ రెండు తత్వాల పొత్తే శివుడు.

శివుడు శ్రామికులలో శ్రామికుడు. మేధావులలో మేధావి. అందుకే శివుడు తన్ను తాను విభజించుకొన్నాడు రెండుగా! శ్రామిక శక్తితో పెండ్లాం పిల్లల్ని పోషిస్తున్నాడు. తెలివి తేటలు పెట్టుబడిగా ప్రియురాలి బాధ్యతల్ని నెత్తికెత్తుకొన్నాడు.

కలిసి వచ్చే కాపురానికి ఏ కాలు పెట్టినా ఒక్కటే అన్నట్లు అదృష్టజాతకులకు ఏమాత్రం ఆధారం లభించినా అందగిస్తుంది. శివుడు వేసే ప్రతి పథకం పారింది. ఒక్కొక్క పథకం పారినప్పుడు ఆమె జీవితం ఒక్కొక్క మలుపు తిరుగుతూ వచ్చింది. చివరకు శివుడు ఎదురుచూసిన తీరుగా లోకం ఎదురుచూడని రీతిగా చూస్తూ చూస్తూ ఉండగానే ఆమె ఎంతో ఎత్తుకు ఎదిగిపోయింది.

'నెత్తిమీది బరువు నేలపడింది. ఒక బాధ్యత తీరింది. అవసరమైతే తన బాధ్యతను కూడా మోయగల శక్తి ఆమెకు వచ్చింది' అని తేలికగా నిట్టూర్చాడు శివుడు. కానీ అసలు బాధ్యత ఇక్కడే ఆరంభమయింది.

వంచిన తలఎత్తకుండా వెంటతిరుగుతూ ఉండిన మనిషి అమాంతంగా ఎదురు తిరిగింది.

"ఏమిటీ అన్యాయం?" అని అడిగితే...

"అన్యాయం నాది కాదు. నీది. ఒకరిని ఒక విధంగా ఇంకొకరిని ఇంకొక విధంగా చూస్తున్నావు. నేనేమీ నిన్ను పెట్టమనలేదు. పోషించమనలేదు. అందరికీ చూపినట్లు నాకూ ఒక దారిచూపించావు. ఆదారి పట్టుకొనిపోతూ నాబతుకు నేను బతుకుతున్నాను.".

'అందరికీ చూపినట్లు తనకూ ఒక దారి...' తగలాల్సిన చోటనే తగిలిందా మాట. శివుడి గుండె బాధగా మూలిగింది. మూలిగినా నీలిగినా చేయగలిగిందేముంది?

"ఆమె సొత్తునుదెచ్చినావిదాన కొట్టమని అడగలేదు. పోనీ వాళ్ళను వదిలేసి నాతోనే ఊరేగు అని కోరలేదు. మనిషికి ఉన్నవి రెండు కండ్లు. ఏ కంటికి దెబ్బ తగిలినా తగిలినట్లే!- గుర్తుంచుకొని మసులుకో!"

మనస్సును పట్టుకొన్న మనిషి వాదించింది కాదు- హెచ్చరించింది!

ఆమె వాదం అర్థవంతంగా ఉన్నట్లే తోచింది. ఆలోచించాడు శివుడు. ఆమె బాధను అర్థం చేసుకొన్నాడు. కొంతకు కొంత అటువైపు మొగ్గుదల చూపాడు.

"ఇదేమైనా న్యాయంగా ఉందా? ఆడది తినే అన్నం కావాలంటే ఒకరికి పెడుతుంది. తనసర్వస్వాన్ని వదులుకోమంటే వదులుకొంటుంది. కానీ భర్తను పంచి ఇవ్వగలుగుతుందా? కడుపుకు కూడు తినే ఏపెద్దమనిషి అయినా సరే న్యాయం చెప్పమను చూద్దాం!" తాళి గట్టించుకొన్న ఇల్లాలు తైతక్కలాడింది.

ఆమెహక్కును వ్యక్తంచేసుకొన్న తీరు న్యాయంగానే కనిపించింది.

ఏం చేయాలి ?

ఎటూ చెప్పలేక అడకత్తెరలో పోకలాగ నలిగిపోతున్నాడు శివుడు. అయినా ఎటువంటి సమస్యకైనా కాలం ఒక పరిష్కారమార్గాన్ని సూచించగలదన్న ధైర్యంతో ఈ బాధను నిబ్బరంగా అనుభవించడానికే నిర్ణయించుకొన్నాడు. కానీ కాలం జరిగే కొద్దీ సమస్య పరిష్కారం కాకుండా పటిష్ఠమవుతూ వచ్చింది.

ఏవూరు వెళ్ళినాసరే, ఏ పనిమీద వెళ్ళినాసరే–ఇంట్లో అడుగు పెట్టీపెట్టక ముందే ఆరంభమవుతుంది పోరు. కారాలు మిరియాలు నూరుతూ ఖణిల్లని రంకె వేస్తుంది ఇల్లాలు. బిడ్డల్ని అలంకరించే ఓపిక ఏ మాత్రం లేకపోయినా చాలాజాగ్రత్తగా భాషను మాత్రం అలంకరిస్తుంది. అలంకారప్రాయంగా దెప్పి పొడుస్తుంది. ఆ మాటలు వినలేక పోరు పడలేక ఈమెను వదిలి ఆమె దగ్గరికి పోతే– 'ఓహో! అయ్యగారికి ఇప్పటికి 'గృహ నిర్బంధం' తప్పిందన్న మాట!' అని కాకులు పొడిచినట్లు పొడుస్తుంది.

అటు నుయ్యి. ఇటు గొయ్యి. గోడ పెట్టూ చెంపదెబ్బా రెండూ తనకే తగులుతున్నాయి. ఎలా భరించాలి? ఎందుకు భరించాలి?

పరిష్కారం కోసం ప్రాకులాడుతూ ప్రతిక్షణమూ ఆలోచిస్తున్నాడు శివుడు.

దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కలిసి కాపురం చేసింది. ఈ శరీరాన్ని పీల్చింది. పిప్పి చేసింది. ఇంకా ఈ పిప్పిలో ఏమి మిగిలిందో! ఈ పిప్పి కోసం తహతహలాడుతూ ఉంది. ఆరు మంది బిడ్డలు ఎదుగుతూ ప్రతిక్షణమూ తమ బాధ్యతల్ని గుర్తు చేస్తూంటే కూడా!

ఆమె!

ఈ పిప్పినికాదు కాంక్షించింది. నమ్మదగిన మగతోడును. ఆ తోడు తోడుగా మిగలాలన్నది ఆమె గోడు!

మనిషిని చంపకుండా చంపడమంటే ఇదే!

ఆ విద్యలో ఇద్దరూ ఇద్దరే.

రైలు పట్టాల్లాంటి మనస్తత్వాలు. అవి ఎప్పటికీ కలవవు. కలవని మనస్తత్వాలమధ్య క్షణ క్షణం నలుగుతూ తాను. అందుకే శివుడు ఆలోచించాడు. కూర్చున్న చోట కూర్చున్నట్లే, నిలబడినచోట నిలబడినట్లే ఆలోచించాడు. కడపటికి ఒక నిర్ణయానికి రానే వచ్చాడు.

ఆ నిర్ణయమే ఆత్మహత్య!

ఆత్మహత్య మహాపాతకమని తెలుసు. కానీ మార్గాంతరం లేదు.

ఆత్మహత్య!

జీవితంలో అన్నివిధాలా ఓడిపోయిన మనిషి చిట్టచివరకు ఒడిగట్టే కట్టకడపటి ప్రయత్నం! ఆ ప్రయత్నం కార్యరూపం దాల్చడానికి ఒక్కటి కాదు. రెండు కాదు. ఓపినన్ని మార్గాలు. ఒకే ఒక చుక్కమందు నాలుకమీద పడితే 'గుటుక్కు'మంటుంది ప్రాణం. గుప్పెడు నిద్ర మాత్రలు మింగితే గుట్టుచప్పుడుగా దీర్ఘనిద్ర. మూరెడు తుండుగుడ్డ మెడకుబిగిస్తే ఏకబిగిని గమ్యం చేరుకోవచ్చు.

కానీ అది కాదు శివుడి ఆలోచన!

పుట్టిన ప్రతిమనిషి ఏనాడో ఒకనాడు చనిపోతాడు. కానీ పుట్టిన ప్రతిమనిషి మేధావి కాలేడు. శరీరానికి మేధస్సుకు అవినాభావ సంబంధమున్నా మేధావి వర్గంలో మేధస్సుకున్న విలువ శరీరానికి లేదు. అయితే వీళ్ళిద్దరి దగ్గర ఈ విలువలే తారుమారవుతున్నాయి. తుచ్ఛమైన శరీరానికి ఇచ్చిన విలువ వాళ్ళు మేధస్సుకు ఇవ్వలేకపోతున్నారు. సంకుచితమైన స్వార్థంతో శరీరంపై దాడిచేసి వాళ్ళు మేధస్సును చంపుతున్నారు. ఇంతకంటే చావడం మేలుగదా?

అందుకే వాళ్ళకీ శరీరం చచ్చిన తరవాతకూడా దక్కకూడదు. అలా దక్కితే కొరగాని వేడుకలు చేస్తారు. అనవసరమైన ఆగడాలు చేస్తారు. ప్రాణం లేని ఆ కట్టెమీద పడి అల్లాడతారు. పొర్లాడతారు. అయినవాళ్ళు కాని వాళ్ళు ఏడుపులతో కలిసి ఏడ్చేంత గొప్పగా ఏడస్తారు. ఆ తరవాత మంటపెట్టికాల్చి బూడిదచేస్తారు. లేకుంటే మట్టిలో కలిపేస్తారు. ఓపిక ఉంటే ఒక సమాధి కట్టించి పూజచేస్తారు– ఏడాదికొకసారి లోకం మెప్పుకోసరం!

ఆ అవకాశంకూడా వాళ్ళకు దక్కకూడదు.

అయితే ఏం చేయాలి?

ఈ శరీరం ముక్కలు ముక్కలు కావాలి. తల, మొండెము, కాళ్ళు, చేతులు దేనికది విడివిడిగా దిక్కుకొకటిగా చెల్లాచెదరు కావాలి. మొండెం పచ్చడైపోవాలి. బ్రమికలు విరిగి పేగులు తెగి గుండె నలిగి రక్తపుమడుగులో చిందరవందరగా భయంకరంగా తయారుకావాలి. చూస్తూంటే అసహ్యంతో జుగుప్సతో ఒళ్ళు గగుర్పొడవాలి. దరిదాపులకు వెళ్ళలేక వాళ్ళు తనకలాడుతుంటే వాళ్ళ కళ్ళముందే కాకులు గద్దలు పొడిచి పొడిచి తింటూ ఉండాలి. అయితే అదెలా సాధ్యపడుతుంది?

ఎందుకు సాధ్యపడదు?

వేగంగా వెళ్ళుతున్న రైలు కిందపడితే... పడితే ఏమవుతుంది? ఆశించినట్లు అక్షరాలా జరిగిపోతుంది. అదికూడా రాత్రిపూట అయితే ఎవరి కంట పడదు. వీళ్ళు వెదుక్కొనేలోపుగా కుక్కలు నక్కలు పీక్కుతినేస్తాయి. ఏ గొడవా ఉండదు.

దీనికి మించిన మార్గమే లేదని నిర్ణయించుకున్నాడు శివుడు.

ఒకనాడు...తన నిర్ణయం నిలకడగా మనస్సులో నిలబడిన నాడు...దాదాపు అర్ధరాత్రి సమయం...ముందూవెనకా చూడకుండా ఆ బాటమీద పరుగెత్తుతున్నాడు శివుడు. ఆ బాటకు సమాంతరంగా వందగజాల దూరంలో రైలుబాట. ఆ బాట వెంబడే దాదాపు రెండు మైళ్ళు వెళ్ళితే అక్కడ పొడిపొడిచెట్ల బయలు. మనిషిమట్రా మసలరు. ఆ చోటయితే అనుకూలంగా ఉంటుంది. తానక్కడికి చేరుకోవడానికి రైలు రావడానికికూడ సరిపోతుంది. అందుకే అటూయిటూ చూడకుండా మరొక్క ఆలోచన మనస్సులోనికి రానీయకుండా పరుగెత్తుతున్నాడు శివుడు.

ఇంకొక్క వంద గజాల దూరం వెళితే తన గమ్యస్థలాన్ని చేరుకుంటాడు శివుడు. పొడిపొడి చెట్ల బయల్లో... మనుషులు మసలని చోటులో... రైలు బాటకు అడ్డంగా నిశ్చలంగా కనులు మూసుకుని పడుకుంటాడు. పడుకున్న కాసేపటికి రైలు తన మీదుగా వెళ్ళిపోతుంది. తన ఆశయం నెరవేరుతుంది. అని అనుకొంటూ పరుగెత్తుతున్నాడు శివుడు. అంతలోనే రైలు శబ్దం చెవిని పడింది. వెనక్కు తిరిగి చూశాడు. శరవేగంతో వస్తున్నది రైలు. అంతే! అక్కడినుండి అడ్డం పడ్డాడు. రాళ్ళు రప్పల్నీ, ముండ్ల పొదల్నీ లెక్కపెట్టకుండా రైలు బాటమీదికి కాలి కొద్దీ పరుగెత్తుతున్నాడు.

రైలు వచ్చేస్తున్నది. ఇంకొక్క పదిబారల దూరం. శక్తినంతా కూడగట్టుకొని పరుగెత్తు తున్నాడు. రైలు రావడానికంటే ఒక్క నిమిషం ముందు చేరుకో గలిగితే చాలు. ఈ బాదర బందీ నుండి శాశ్వతంగా విముక్తి లభిస్తుంది.

ఊపిరి బిగపట్టి పరుగెత్తుతున్నాడు శివుడు. రైలుబాట దగ్గిరికి చేరుకొంటున్నాడు. ఇంకెంత దూరం? బారెడంటే బారెడు. ముందుకురుకుతున్నాడు. రైలు వచ్చేసింది. పొట్టేలులా ముందుకు దూరబోయిన శివుడు ´తటాలున నిలదొక్కుకుని నిలబడి నిలబడలేక నాలుగడుగులు వెనక్కు వేశాడు.

రైలు శరవేగంతో ముందుకు దూసుకుపోయింది.

కంటపడిన దృశ్యంతో కాలు ఇటుఅటు కదపలేక వణికిపోతున్నాడు శివుడు.

రక్తపు మడుగులో విలవిల్లాడుతూఉంది ఒక మొండెం.

అతడెవడో? ఇతనికంటే ఘనుడుగా ఉన్నాడు. అందుకే ఇతని కంటే ముందు గమ్యం చేరుకొన్నాడు.

సరిగ్గా నడుంమీద ఎక్కినట్లుంది రైలు చక్రం. రెండుగా తునాతునకలయ్యాడు మనిషి. తల మొండెం ఎగిరి ఈపక్కపడింది. తుంటి కాళ్ళు ఇంకొక చక్రంకింద పడి నుజ్జునుజ్జయి పోయాయి. మొండెం విలవిల లాడుతూ ఉంది. చిమ్మనగ్రోవిలో చిమ్మినట్లు రక్తం చిమ్ముతూ ఉంది.

ఆ దృశ్యాన్ని చూసి భరించలేక నిలువెల్లా వణికిపోతున్నాడు. వణికిపోతూ గట్టిగా కళ్ళు మూసుకున్నాడు కాసేపు.

రైలు ఎంతో దూరం వెళ్ళిపోయినట్లుగా శబ్దం లీలగా వినిపిస్తూ ఉంది. రహదారి మీద పోతున్న లారీలు గుండెల మీదుగా పోతున్నట్లుంది. ఆ పొడిచెట్ల బయల్లో అదో విధమైన రొద.

కాసంత గుండెదడ తగ్గింది శివుడికి. నిదానించి కళ్ళు తెరిచి చూశాడు. ఇప్పుడు మొండెం తనకలాడడం లేదు. రక్తం చిమ్మడంకూడా తగ్గిపోయింది. ఎవరో? ఏమో? అని వంగి పరీక్షగా చూశాడు.

అప్పుడతని కంట పడిందొక కాగితం. బిగుసుకున్న పిడికిట్లో నలిగినట్లున్న కాగితం. అతనిలో ఉత్సుకత రేకెత్తింది. ఆ కాగితమేమిటో చూడాలన్న కోరిక కలిగింది. మెల్లగా ఆ మొండాన్ని సమీపించాడు. అతి జాగ్రత్తగా ఆ కాగితాన్ని లాక్కున్నాడు.

మసక వెన్నెల్లో ఆ కాగితాన్ని విప్పి కండ్లు చించుకొని చదివాడు శివుడు.

"రాణీ! ఎంత ప్రయత్నించినా నీ హృదయం దరిదాపులకు చేరుకోలేకపోయాను. ఇక ఎందుకీబతుకు? ఎవరికోసం వృథాగా బతకాలి. అందుకే వెళ్ళిపోతున్నాను. నువ్వు ఎప్పటికీ నన్ను చేరుకోలేనంత దూరంగా...శాశ్వతంగా... నీ రాజు."

మళ్ళీ మళ్ళీ చదువుకొన్నాడా ఉత్తరాన్ని శివుడు. పిచ్చిగా తనలో తాను నవ్వుకొన్నాడు అంత బాధలో కూడా!

ఒక్క హృదయం దగ్గరగాలేదని ఆత్మహత్య చేసుకున్నాడు పిచ్చివాడు.

రెండు హృదయాలు దగ్గరవుతూంటే తాను ఆత్మహత్యకు తలపడితే- తాను వాడికంటే పిచ్చివాడు!

పిచ్చిగా నవ్వుకున్నాడు శివుడు- బిగుసుకున్న పిడికిట్లో ప్రేమలేఖ నలిగి పోతూ ఉంటే...

గిరక్కున వెనక్కు తిరిగాడు. అడుగుమీద అడుగ్గా ముందుకు నడుస్తున్నాడు.

నడుస్తుంటే మానసాకాశంలో మెరుపుల విరుపులు!

లోకంలో సమస్యలు లేనిదెవరికి? సమస్యలకు తలవంచేవాడు భీరువు. తలెత్తి ధైర్యంగా పోరాడేవాడు ధీరుడు!

ధీరుడు జీవిస్తాడు. భీరువు మరణిస్తాడు!

ఏ పరిస్థితుల్లోనూ సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు. కానేకాదు!

శివుడు బతికే ఉన్నాడు!- కండ్లారా చూసిన ఆత్మహత్య మనసుకండ్లు తెరిపిస్తే!! ●

ఆంధ్రప్రభ
(3, ఫిబ్రవరి 1982)